క్లుప్తంగా

సుబ్రహ్మణ్యేశ్వరుడికి అభిషేకాలు



వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి

సింహాచలం: అడవివరంలోని విజినిగిరిపాలెంలో కొలువైన వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం స్వామికి విశేషంగా పూజలు జరిగాయి. ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం వరకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామికి అభిషేకాలు నిర్వహించారు. ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేశారు. ఆలయ అర్చకులు ద్వాదశి సోదరులు, ఉదయ్‌కృష్ణశర్మ ఈ పూజలు నిర్వహించారు.

ఘనంగా జీఎస్టీ దినోత్సవం



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ డాక్టర్ సీతాలక్ష్మి

సబ్బవరం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జీఎస్టీ దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. కళాశాల వాణిజ్య విభాగం ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలను చేపట్టారు. విద్యార్థులకు పోస్టర్ ప్రదర్శన, క్విజ్ తదితర పోటీలు నిర్వహించి, ప్రతిభ చూపిన వారికి బహుమతులు అందించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ బి.సీతాలక్ష్మి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జీఎస్టీ ప్రవేశపెట్టడంలో ప్రధాన ఉద్దేశం, దాని అవసరం, ప్రయోజనాలు, భారత ఆర్థిక వ్యవస్థపై దాని ప్రభావం గురించి అధ్యాపకులు వివరించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బి.శంకర్, తెలుగు అధ్యాపకులు ఎస్.సత్యనారాయణ, కామర్స్ అధ్యాపకులు ఎం.గోవిందరావు, బి.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అప్పన్నకు ఘనంగా నిత్యకల్యాణం



నిత్యకల్యాణంలో తలంబ్రాలు ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి మంగళవారం నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ ఆస్థాన మండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేంజేపచేసి ఉదయం 9.30 నుంచి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణాన్ని ఘనంగా జరిపారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలను అందించారు.

వైభవంగా బంగారమ్మతల్లి పండగ



బంగారమ్మను దర్శించుకుంటున్న గండి రవికుమార్ తదితరులు

సబ్బవరం: మండలంలోని అసకపల్లిలో కొలువైన బంగారమ్మతల్లి పండగ మహోత్సవం మంగళవారం వైభవంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు వేకువజాము నుంచే గుడికి చేరుకుని, అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపారు. పండగ సందర్భంగా నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు గండి రవికుమార్ అమ్మవారిని దర్శించుకుని, పూజలు జరిపారు. అమ్మవారిని దర్శించుకున్న వారిలో పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు కాపుశెట్టి శేషుబాబు, నీలవేణి దంపతులు, సబ్బవరం సర్పంచ్ దెడ్డం ప్రసాదరావు, బలిరెడ్డి కనకరాజు, ఉప సర్పంచ్ శిరపరపు సురేష్, సిరపు వాసు, దువ్వి దుర్గాలు, దాడి సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

పశువైద్యురాలు బాధ్యతల స్వీకరణ



పశువైద్యురాలు డాక్టర్ అనూష

పరవాడ: లంకెలపాలెం పశువైద్యురాలిగా డాక్టర్ అనూష మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడి పశువైద్యురాలు అశ్విని ప్రఫుల్లా ఆనందపురం మండలం శొంఠ్యాం బదిలీ అయ్యారు. ఆమె స్థానంలో బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ అనూష మాట్లాడుతూ పాడి రైతులకు నిత్యం అందుబాటులో ఉంటూ, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు.

సమయం చూసి.. చక్కబెట్టేశారు

పరిస్థితులెలా ఉన్నా.. కనిపించిన ప్రతి ఖాళీ స్థలాన్ని ఆక్రమించడమే పనిగా పెట్టుకున్న పెందుర్తిలోని కూటమి నేతలకు గత నెల్లో జరిగిన యోగాంధ్ర బాగా కలిసొచ్చింది. అదే సమయంలో రెవెన్యూ బదిలీలు, ఇక్కడి తహసీల్దార్ నియామకంలో జరిగిన తాత్సారాన్ని అనుకూలంగా మార్చుకున్నారు. కొత్త కబ్జాలతోపాటు, గతంలో అధికారులు గుర్తించి, హెచ్చరిక బోర్డులు పెట్టిన చోట వాటిని తొలగించి మరీ ఆక్రమణకు బరితెగించారు. వీరి కబ్జాకాండకు అడ్డూఅదుపూ లేకుండా పోతోందని స్థానికులు ఆక్షేపిస్తున్నారు.

- యోగాంధ్రలో యంత్రాంగం.. పెందుర్తిలో కబ్జా తతంగం
- ఆక్రమణదారులకు కలిసొచ్చిన తహసీల్దార్ నియామక జాప్యం
- 88వ వార్డు నరవలో రూ.కోట్లు విలువైన ప్రభుత్వ స్థలాల కబ్జా
- 97వ వార్డు కార్మికనగర్‌లో హెచ్చరికబోర్డులు తొలగించి మరీ పాకలు



యోగాంధ్ర కార్యక్రమం సమయంలో కార్మికనగర్ చెరువులో ఉన్న హెచ్చరికబోర్డు



ప్రస్తుతం కార్మికనగర్‌లో మాయమైన హెచ్చరికబోర్డు

పెందుర్తి: యోగాంధ్ర ఓ వైపు.. రెగ్యులర్ తహసీల్దార్ లేకపోవడం మరోవైపు.. అధికారుల బదిలీల ప్రహసనం ఇంకోవైపు.. వెరసి గత నెలన్నర రోజుల సమయం పెందుర్తి పట్టణంలోని కబ్జారాయుళ్లకు బాగా కొలిసొచ్చింది. ఇప్పటికే ప్రభుత్వ భూములను పప్పుబెల్లాల్లా పంచుకుంటున్న కూటమి నాయకులకు ఈ కాలం మరింత అనుకూలించింది. దీంతో ప్రభుత్వ భూములు, గెడ్డ స్థలాల్లో పాగా వేశారు. ప్రస్తుతం ఆయా స్థలాల్లో నిర్మాణాలు యథేచ్ఛగా వెలిశాయి. అప్పట్లో ఆయా ఆక్రమణలపై ఫిర్యాదులు వచ్చినా 'మేం యోగాంధ్ర కార్యక్రమంలో ఉన్నాం.. తహసీల్దార్ లేరు కదా వచ్చాక చూద్దాం'అంటూ క్షేత్రస్థాయి సిబ్బంది కూడా కబ్జారాయుళ్లకు 'మామూళ్ల'గా సహకారం అందించారన్న ఆరోపణలున్నాయి. పెందుర్తి రెవెన్యూ పరిధిలో పలుచోట్ల ప్రభుత్వ భూములను సమయం



హెచ్చరిక బోర్డు పీకేసి వేసిన పాక

చూసి సర్దేసుకున్నారు.

కార్మికనగర్లో ఆ ముగ్గురు..

చినముషిడివాడ కార్మికనగర్లో కబ్జా డాన్‌లుగా ముద్ర పడిన ముగ్గురు స్థానిక టీడీపీ నాయకులు ఇక్కడి సర్వే నెంబర్ 163ని పూర్తిగా గుప్పెట్లో పెట్టుకున్నారు. చెరువును కొంచెం కొంచెం మట్టితో కప్పి షెడ్‌లు నిర్మించడమే వీరి దినచర్య. బహిరంగంగానే దురాక్రమణ చేసి, అమ్మకాలు జరపగా వచ్చిన సొమ్ములో వాటాలను స్థానిక ప్రజాప్రతినిధులకు అందించడంతో వారు అధికారుల నోళ్లు



జీవీఎంసీ 88వ వార్డు నరవ మన్నెపాలెం వద్ద సర్వే నెంబర్ 29 ప్రభుత్వ స్థలంలో అక్రమ నిర్మాణం

మూయిస్తున్నారు. ఇక ప్రస్తుతానికి వస్తే.. కార్మికనగర్ చెరువుకు సమీపంలో ప్రభుత్వ స్థలం అంటూ కొన్నాళ్ల క్రితం హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు.

మన్నెపాలెంలో ప్రభుత్వ భూమి ఆక్రమణ:

మరోవైపు జీవీఎంసీ 88వ వార్డు నరవలోనూ కూటమి నాయకులు కబ్జాల్లో ఆరితేరిపోయారు. ఇప్పటికే ఇక్కడ అక్రమ మైనింగ్‌తో ప్రకృతి సంపదను దోచుకుంటున్న టీడీపీ, జనసేన నాయకులు తాజాగా గెడ్డలపై పడ్డారు. ఇక్కడి సర్వే నెం.29లో మన్నెపాలెం వద్ద ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించారు. అందులో ఇటీవల భారీ భవనం నిర్మించారు. ఇంత జరుగుతున్నా రెవెన్యూ సిబ్బంది కన్నెత్తి చూడకపోవడం గమనార్హం. దీనిపై స్థానికులు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదులు చేసినా వారు పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఈ భూ దందాలకు అడ్డుకట్ట వేయాలని కోరుతున్నారు.

యోగాంధ్ర సమయంలో ఆ బోర్డును తొలగించిన ఆక్రమణదారులు దానికి సమీపంలోనే పాకలు వేశారు. వాటిని దర్జాగా విక్రయించి, సొమ్ము చేసుకున్నారు.

కబ్జాకు పాల్పడితే కఠిన చర్యలు

> ప్రభుత్వ స్థలాల సంరక్షణే మా బాధ్యత. ప్రభుత్వ స్థలంలో ఎవరు నిర్మాణం చేపట్టినా కూల్చేస్తాం. ఎవరైనా బాధితులు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేస్తే దానిపై విచారణ జరిపి, చర్యలు తీసుకుంటాం. ప్రభుత్వ స్థలాలు కొనుగోలు చేస్తే నష్టపోవడం తప్ప ఇంకేం ప్రయోజనం ఉండదు. మా సిబ్బందిని ప్రభుత్వ స్థలాల ఆక్రమణలపై అప్రమత్తం చేస్తా.
>
> – ఎ.సంతోష్‌కిరణ్, ఇన్‌చార్జి తహసీల్దార్, పెందుర్తి

గిరి ప్రదక్షిణ భక్తులకు సౌకర్యాలు



ఏర్పాట్లను పరిశీలిస్తున్న జీవీఎంసీ కమిషనర్

సింహాచలం: సింహాచలం గిరి ప్రదక్షిణ సందర్భంగా భక్తులకు కల్పించాల్సిన సౌకర్యాలపై జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్.. దేవస్థానం అధికారులతో కలిసి మంగళవారం ప్రదక్షిణ మార్గాన్ని పరిశీలించారు. సింహాచలంలోని కొండదిగువ తొలిపావంచా, అడవివరం జంక్షన్, ముడసర్లోవ, విశాలాక్షినగర్, తెన్నేటి పార్క్, లుంబినీ పార్క్ బీచ్, వెంకోజీపాలెం, సీతమ్మధార, నరసింహనగర్, మాధవధారలోని మాధవస్వామి ఆలయం, హైవే, ఎస్‌వీఎల్, లక్ష్మీనగర్, గోపాలపట్నం మీదుగా తిరిగి సింహాచలం చేరుకునే గిరి ప్రదక్షిణ మార్గంలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. భక్తుల కోసం ప్రదక్షిణ మార్గంలో తాత్కాలిక మరుగుదొడ్లు, స్నానాల గదులు, తాగునీటి పాయింట్లు, వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. నిరంతర పారిశుధ్య పర్యవేక్షణకు సిబ్బందిని, డస్ట్‌బిన్‌లను అందుబాటులో ఉంచాలన్నారు. రాత్రి వేళలో భక్తులకు ఇబ్బందులు కలగకుండా చీకటి ప్రదేశాల్లో వీధి దీపాలు, కూడళ్లలో సూచిక బోర్డులు, పబ్లిక్ అడ్రస్ సిస్టమ్ ఏర్పాటు చేయాలని సూచించారు. మార్గమధ్యలో అసంపూర్తిగా ఉన్న రోడ్ల పనులను వెంటనే పూర్తి చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. జీవీఎంసీ, దేవస్థానం అధికారులు సమన్వయంతో ఈ ఏర్పాట్లను పూర్తి చేయాలని కమిషనర్ స్పష్టం చేశారు. దేవస్థానం ఈవో త్రినాథరావు, ఈఈ రమణ, జోనల్ కమిషనర్లు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

వారాహి అమ్మవారికి ప్రత్యేక పూజలు



దివ్య అలంకరణలో వారాహి అమ్మవారు



అమ్మవారి సన్నిధిలో భక్తులు నిర్వహిస్తున్న సిరిజ్యోతి పూజ

సబ్బవరం: ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రం దేవీపురంలోని సహస్రాక్షి రాజరాజేశ్వరీదేవి క్షేత్రంలో వారాహి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా 6వ రోజు మంగళవారం అమ్మవారికి చిత్ర కంకణ అలంకారం సర్వాంగ సుందరంగా జరిపారు. అమ్మవారిని భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. సాయంత్రం వారాహి యంత్ర సిరిజ్యోతి పూజ, రాత్రి శ్రీరుద్ర సహిత-శ్రీవారాహి హోమం నిర్వహించారు. ఈ హోమం ద్వారా కొత్త వ్యాపారాలు, ప్రాజెక్టుల్లో విజయాలు కలుగడంతోపాటు, కర్మ దోషాలు, ప్రతికూలతలు తొలగిపోతాయని భక్తుల విశ్వాసం. బుధవారం రాత్రికి ఖడ్గమాల సహిత వారాహి హోమం నిర్వహించనున్నట్లు గురుమాత అన్నపూర్ణమ్మ తెలిపారు. కార్యక్రమంలో భాగంగా అమ్మవారికి క్షీరాభిషేకం, షోడశోపచార సహిత కుంకుమ పూజలు జరిపారు. మధ్యాహ్నం అమ్మవారి సన్నిధిలో గురుమాత చేతుల మీదుగా అన్నసమారాధన చేశారు.

లివర్ వ్యాధిగ్రస్తుడికి ఆర్థిక సాయం

సింహాచలం: కాలేయ(లివర్) సంబంధిత వ్యాధితో బాధపడుతున్న అడవివరానికి చెందిన గొర్లె ఆకాష్‌కు అక్కడి నవ యువ సేవా సంఘం రూ.10 వేలు ఆర్థిక సాయం అందించింది. సంఘం అధ్యక్షుడు ప్రవీణ్ తదితరులు ఆకాష్ ఇంటికి మంగళవారం వెళ్లి కుటుంబ సభ్యులకు ఈ నగదును అందించారు. సంఘం తరఫున ఏటా రక్తదాన శిబిరాలతో పాటు, పలు స్వచ్ఛంద కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు.



ఆకాష్ తల్లికి నగదు అందిస్తున్న నవ యువ సేవా సంఘం అధ్యక్షుడు ప్రవీణ్, తదితరులు

ఘనంగా లక్ష్మీదేవి అమ్మవారి ఊరేగింపు



లక్ష్మీదేవిని పల్లకిలో ఊరేగిస్తున్న పండా కుటుంబీకులు, భక్తులు



నరసింహస్వామి, రాముడి అవతారాల్లో జగన్నాథస్వామి

అగనంపూడి: జగన్నాథస్వామి రథోత్సవాల్లో భాగంగా హేరా పంచమి (లక్ష్మీదేవి పూజ) సందర్భంగా లక్ష్మీదేవి అమ్మవారిని మంగళవారం పురవీధుల్లో ఊరేగించారు. ఆలయ ప్రధానార్చకుడు గురు సంతోష్‌కుమార్ స్వామి వారిని నరసింహస్వామి, రాముడి అవతారాల్లో అలంకరించారు. రెండు అవతారాల్లోని జగన్నాథస్వామిని భక్తులు దర్శించుకుని విశేష పూజలు చేశారు. సాయంత్రం హేరా పంచమిని పురస్కరించుకొని దీపారాధన చేశారు. ఈ సందర్భంగా లక్ష్మీదేవి అలకపాన్పు వహించడం, ఆమెను తిరిగి ఇంద్రద్యుమ్నహాలు వద్దకు తీసుకువెళ్లే ఘటనను మహిళలు కళ్లకు కట్టినట్టు తెలియజేశారు. ఉదయం పారాణి సేవా సమితి, సాయంత్రం సత్యసాయి భజన మండళ్ల ఆధ్వర్యంలో లలిత సహస్ర పారాయణం, భక్తిగీతాలాపన చేశారు. కార్యక్రమంలో గురు త్రినాథ్, మోహన్, ఆలయ ఈవో పద్మావతి, ఉత్సవ కమిటీ ప్రతినిధులు కరణం పైడిరాజు, మామిడి నాగేశ్వరరావు, గల్లా సాయి, నారపిని నాగమణి, కుసుమంచి కుమారి, సిమ్మిది వరదారాణి, కరణం జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీ



పింఛన్ అందిస్తున్న గండి బాబ్జి

పరవాడ: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పెందుర్తి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ గండి బాబ్జీ పిలుపునిచ్చారు. పరవాడలో ఏర్పాటు చేసిన పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని, లబ్ధిదారులకు పింఛన్లు అందించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పైల చినఅక్కునాయుడు, అట్టా సన్యాసప్పారావు, పైల బుజ్జి, కలిదిండి రామకృష్ణరాజు, పైల కృష్ణ, పంచాయతీ కార్యదర్శి మురళీధర్ పటానాయక్ పలువురు నాయకులు పాల్గొన్నారు.

ఐఐపీఈలో స్వచ్ఛతా పక్వాడా

సబ్బవరం: మండలంలోని వంగలిలో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం అండ్ ఎనర్జీ(ఐఐపీఈ) ఆధ్వర్యంలో బుధవారం స్వచ్ఛతా పక్వాడా నిర్వహించనున్నట్లు ఇన్‌స్టిట్యూట్ జాయింట్ రిజిస్ట్రార్, కార్యక్రమం నోడల్ ఆఫీసర్ మురళీకృష్ణ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో భాగంగా గ్రామంలో పలు కార్యక్రమాలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. ఉచిత వైద్య శిబిరం, మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు క్రీడా సామగ్రి పంపిణీ, పారిశుధ్య కార్మికులకు సన్మానం, పాఠశాల ఆవరణంలో మొక్కలు నాటే కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఈ నెల 15 వరకూ స్వచ్ఛతా పక్వాడా కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు.

పేదలకు గొడుగులు, అల్పాహారం వితరణ



గొడుగులు, అల్పాహారం అందిస్తున్న సర్వహిత చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధులు

అగనంపూడి: జీవీఎంసీ 85వ వార్డు పెదమడకలోని సర్వహిత చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అగనంపూడి నిర్వాసితకాలనీల్లోని నిరుపేదలకు గొడుగులు, అల్పాహారం అందించారు. అగనంపూడి వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు మడుగల నరసింగరావు వీటిని సమకూర్చారు. ట్రస్ట్ వ్యవస్థాపకుడు గుదే సుశీలా గజేంద్రరావు, ప్రతినిధులు కిడిమి హనుమంతురావు, పొన్న గంటి కొండలరావు, వంకర రాము, కరణం పైడిరాజు పాల్గొన్నారు.

వెబ్ ఆప్షన్ల నమోదు వేగవంతం



పాలిటెక్నిక్ కళాశాలలో వెబ్ ఆప్షన్‌లు నమోదు చేసుకుంటున్న విద్యార్థులు

పెందుర్తి: పాలిటెక్నిక్ కోర్సుల్లో చేరేందుకు పాలిసెట్ విద్యార్థులకు వెబ్ ఆప్షన్ల ప్రక్రియ సజావుగా సాగుతున్నట్లు స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.చంద్రశేఖర్ తెలిపారు. మంగళవారం పాలిసెట్ ర్యాంకర్ల వెబ్ ఆప్షన్ల ప్రక్రియ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు రోజుల పాటు పాలిసెట్ 1వ ర్యాంక్ నుంచి 50,000 ర్యాంక్ వరకు 30 మంది అభ్యర్థులు హాజరయ్యారన్నారు. బుధ, గురువారాల్లో 50,001 నుంచి 90,000 ర్యాంక్ విద్యార్థుల ఆప్షన్లు నమోదు చేయిస్తామన్నారు.

వైఎస్సార్‌సీపీ విస్తృత సమావేశం వాయిదా

పెందుర్తి: సబ్బవరంలో బుధవారం జరగాల్సిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం వర్షాల కారణంగా వాయిదా వేస్తున్నట్లు పార్టీ నియోజకవర్గ కేంద్ర కార్యాలయ ప్రతినిధులు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఈ సమావేశాన్ని నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు గమనించాలని కోరారు.

రైతు సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం



రైతులకు వరి విత్తనాలు అందిస్తున్న ఎమ్మెల్యే పంచకర్ల

పరవాడ: రైతుల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు అన్నారు. స్థానిక వ్యవసాయ కార్యాలయ ఆవరణలో రైతులకు రాయితీపై మంజూరు చేసిన 152 క్వింటాళ్ల వరి విత్తనాలను మంగళవారం అందించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీ మేరకు వారికి అవసరమైన విత్తనాలు, ఎరువులు నిర్ణీత సమయంలో సరఫరా చేస్తుందన్నారు. ఎన్నికల్లో రైతాంగానికి ఇచ్చిన హామీ మేరకు అన్నదాత సుఖీభవ పథకాన్ని త్వరలో అమలు చేయనున్నట్లు పేర్కొన్నారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో వృద్ధులు, వికలాంగులకు ప్రభుత్వం మంజూరు చేసిన పింఛన్లను అందించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ సుబ్రహ్మణ్యం, సబ్బవరం, పరవాడ వ్యవసాయ శాఖ అధికారులు పోతల సత్యనారాయణ, ఎం.రమాదేవి, పరవాడ ఎంపీడీవో రమేష్‌నాయుడు, మాజీ జెడ్పీటీసీ పైల జగన్నాథరావు, మాజీ ఎంపీపీ మాసవరపు అప్పలనాయుడు, సర్పంచ్‌లు సిరపరపు అప్పలనాయుడు, మోటూరి సన్యాసినాయుడు, వియ్యపు చిన్న, కూటమి నాయకులు పాల్గొన్నారు.

'ముఠా కార్మికుల సమగ్ర చట్టం అమలు చేయాలి'



కరపత్రాలను ప్రదర్శిస్తున్న సిటు నాయకులు

పరవాడ: ముఠా కార్మికుల సంక్షేమానికి సమగ్ర చట్టం అమలు చేయాలని సిటు రాష్ట్ర కార్యదర్శి జి.కోటేశ్వరరావు డిమాండ్ చేశారు. లంకెలపాలెంలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో ముఠా కార్మికులతో కలిసి ఈ నెల 9న జరగనున్న దేశవ్యాప్త సమ్మెపై కరపత్రాలను పంచిపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఠా కార్మికులకు సమగ్ర చట్టం అమలు చేస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం కార్మికులకు ఆసరాగా ఉన్న 44 కార్మిక చట్టాలను పెట్టుబడిదారులకు అనుకూలంగా మార్పులు చేయడం దుర్మార్గమన్నారు. ముఠా కార్మికులకు సమగ్ర చట్టం అమలు చేసి నాలుగు లేబర్‌కోడ్స్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పని భద్రత కల్పించడంతో పాటు రూ.10 లక్షల బీమా, పెన్షన్ సౌకర్యం కల్పించాలన్నారు. దేశవ్యాప్త సమ్మెలో కార్మికులందరు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిటు జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ, దాసరి దేముడు, కె.వెంకటరావు, శ్రీను, తాతబాబు పాల్గొన్నారు.

కాలనీల సమస్యలపై ఎమ్మెల్యేకు వినతి



ఎమ్మెల్యే పంచకర్లకు వినతిపత్రం అందిస్తున్న ఐద్వా ప్రతినిధులు

పరవాడ: గొర్లివానిపాలెం జేఎన్‌ఎన్‌యూఆర్‌ఎం, టిడ్కో కాలనీ ప్రజల సమస్యలను పరిష్కరించాలని ఐద్వా మహిళా సంఘ అధ్యక్షురాలు పి.మాణిక్యం ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబును కోరారు. మంగళవారం మండల పర్యటనలో పాల్గొన్న ఎమ్మెల్యేకు కాలనీ సమస్యలపై వినతిపత్రం అందించారు. కాలనీలకు దూరంగా ఏర్పాటు చేసిన రేషన్ డిపో కారణంగా వ్యయ ప్రయాసలు ఎదుర్కొంటున్నారని, స్థానికంగా రేషన్ డిపోను ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. చెత్తబండి రాకపోవడంతో రోడ్లపై చెత్తాచెదారం పేరుకుపోయి దోమలు పెరిగి, అనారోగ్యం బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాలనీల్లో వీధి దీపాల్లేక రాత్రి వేళ విష జంతువులు సంచారంతో చీకటి పడితే రోడ్లపైకి రాలేకపోతున్నట్లు పేర్కొన్నారు. ఇటీవల ఏర్పాటు చేసిన వీధి దీపాలు వెలగట్లేదన్నారు. సమస్యలపై ఎమ్మెల్యే పంచకర్ల సానుకూలంగా స్పందించారని మాణిక్యం చెప్పారు. ఆమె వెంట ఐద్వా మండల అధ్యక్ష, కార్యదర్శులు బంగారమ్మ, అన్నపూర్ణ, కాలనీవాసులు ఉన్నారు.

చినుకు పడితే... చిత్తడే చిత్తడి



వుడా కాలనీ చైతన్య కళాశాల పక్కన రోడ్డు పరిస్థితి



హౌసింగ్ బోర్డు కాలనీ పెంటమాంబ ఆలయం సమీపంలో చెరువును తలపిస్తున్న రోడ్డు

పెదగంట్యాడ: మండలంలో మంగళవారం కురిసిన చిన్నపాటి వర్షానికే పలు ప్రాంతాల్లో రోడ్లు జలమయమయ్యాయి. ఖాళీ ప్రదేశాలు చిత్తడిగా మారాయి. జీవీఎంసీ 76వ వార్డు నడుపూరు గెడ్డ పక్కన రోడ్డు,73వ వార్డు వుడా కాలనీ చైతన్య కాలేజీ పక్క రోడ్డు, 75వ వార్డు పెంటమాంబ ఆలయం సమీపంలో ఉన్న రోడ్లపై వర్షపు నీరు నిలిచిపోయింది. వాహన చోదకులు, పాదచారులు బురదలోంచే రాకపోకలు సాగించాల్సి వచ్చింది. ఈ ప్రాంతాల్లో విద్యార్థులు, పలు కంపెనీల్లో పనిచేస్తున్న కార్మికులు, అధికారులు, సిబ్బంది అంతా ఈ రోడ్లు గుండానే వెళ్లాలి. రాకపోకల సమయంలో విద్యార్థుల బూట్లు, సాక్సులు తడిసిపోతున్నాయి. అధికారులు స్పందించి రోడ్లను బాగు చేయాలని పలువురు కోరుతున్నారు. వర్షపు నీరు నిలవకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని విన్నవిస్తున్నారు.